# గోడమీది పేరు

ఆకునూరి హాసన్

పెద్దగా శబ్దం చేస్తూ మ్రోగింది అలారం టైమ్ పీస్..

ఉలిక్కిపడి చప్పున కళ్ళు తెరిచి చూసింది సులోచన.

నాలుగు గంటలు చూపిస్తోంది గడియారం. గదిలో మసక వెలుతురు వుండీ లేనట్లుగా వుంది. మూసివున్న కిటికీ సందుల్లోంచి సన్నని వెలుగు రేక నీడల్ని కల్పిస్తోంది.

ఒక్కసారిగా కళ్ళు తెరవడంతో సులోచన కళ్ళు ఇసుకపోసినట్లుగా మండాయి. మళ్ళీ కళ్ళు మూసుకుంది ఆమె.

పాత కాలపు సీలింగ్ ఫాన్ చేసే చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

ఇంతలో వున్నట్లుండి కింది హాల్లోంచి ఎవర్నో పెద్దగా అరుస్తున్న హీరాబాయి గొంతు మూసిన తలుపుల్ని చీల్చుకుని కర్ణ కఠోరంగా వినిపించింది.

వర్తమానం... ఆ గొంతులోని కరుకుదనంతో పాటే గలీజుగా, అసహ్యంగా సులోచన కళ్ళ ముందు మెదిలింది. వెంటనే మంచం మీంచి లేచి నిలబడింది. చెదిరిన కుచ్చెళ్ళు సరిచేసుకుంటుండగా, అప్పటి దాకా మూసి వున్న తలుపు తీసుకుంటూ లోపలికొచ్చింది అమీనా.

అమీనాకి పన్నెండేళ్ళుంటాయి. రైలు ప్రయాణంలో దొరికిందని చెబుతుంటుంది హీరాబాయి. ఆ బిల్డింగ్‌లోకి, హీరాబాయి ఆధీనంలోకి వచ్చి ఆరేళ్ళయింది. ఆ బిల్డింగ్‌లోని అమ్మాయికి అవి ఇవీ అందిస్తూ హీరాబాయి చేతికింద ఈగలు వాలుతున్న పుండు లాంటి జీవితానికి అలవాటు పడి, కుళ్ళిన మురుగు కాలువనే పవిత్ర గంగగా, వొళ్ళమ్ముకునే ఆడ పిల్లల్నే దేవకన్యలుగా భావిస్తూ, తపనతో, ఆర్తితో తెలీని, తెలుసుకోలేని బాహ్య ప్రపంచం గూర్చి జీవితం గూర్చి కలలు కంటూ... రేకులు విప్పుకోబోతున్న పసిమొగ్గ లాంటిది అమీనా.

చేతిలోని టీ కప్పుని బల్లమీద పెట్టి సులోచన వైపు చూసి నవ్వింది అమీనా.

వొళ్ళు విరుచుకుంటున్న సులోచనని అడిగింది. "ఎంత సేపయిందక్కా లేచి?" అని.

చెదిరిన ముంగురుల్ని సవరించుకుంటూ 'ఇప్పుడేలే' అని చెప్పింది సులోచన. ఆ జీవితానికే అలవాటు పడిపోయాక అసలేమీ వుండదు. చివరికి ఆలోచన కూడా.

సులోచన కళ్ళలో స్పష్టంగా కన్పించే నిర్లిప్తత... ఆమె మనసు ఏవిధంగా మలచబడిందో తెలియజేస్తుంది. జీవించడానికి ఇకముందు ఏమీ మిగిలి



లేదు అని అర్థమైపోయాక, స్పష్టమైనాక గుండె లోతుల్లోంచి కనుకొలకుల వరకూ ఒక్కొక్క పొరే పేరుకుంటూ వచ్చిన భయంకరమైన నిర్లిప్తత అది.

ఎందుకు సులోచన యథాలాపంగా గది మధ్యలో నిలబడిన అమీనా వైపు చూసింది.

పాలుగారే చెంపలూ, తెల్లటి మెడ మీద నుదుటి మీద చెంపల మీద విచ్చలవిడిగా పరుచుకున్న పొగరెక్కిన జుట్టు కొసలూ, పన్నీటిలో ముంచిన గులాబీ రెక్కల్లాంటి స్వచ్ఛమైన అందంతో మెరిసే లేత పెదవులూ... అమాయకంగా, ఆశ్చర్యంగా చూస్తూ వెతుకుతున్నట్టున్న ఆ కళ్ళు... అమీనా!! అమీనాని చూస్తుంటే ఆమె లేత సౌందర్యాన్ని చూస్తుంటే సులోచనకి తన గతమంటూ వల్చటి గాలి తెరలాగా గుండెలోకి ప్రవహించి, అలా తడుముతూ దిగులుగా ఎటో వెళ్ళినట్లుగా అనిపించింది.

రోజులాగే గోడకి తగిలించబడిన సీనరీని చూస్తూ వేరేలోకంలోకి వెళ్ళిపోయి నిలబడి వుంది అమీనా.

తను గదిలోకి రాకముందు ఎవరో గోడకి తగిలించిన పెద్ద సీనరీ అది. ఎత్తుగా ఆకాశంలోకి పెరిగిన టేకు చెట్లు. చెట్లని చీల్చుకుని వంపుల తిరిగి మాయమవుతున్న మట్టి తోవ, పసుప్పచ్చటి పూల మధ్య నించి ఒకళ్ళ చేతులో ఒకళ్ళ చేతులుంచుకుని తోవలో నడుస్తు వెళ్తున్న ఒక స్త్రీ, ఒక పురుషుడు.

'నేనెళ్తున్నా నక్కా" అమీనా మాటలకు అప్పటి దాకా సీనరినే చూస్తున్న సులోచన ఉలిక్కి పడింది. గది తలుపులు ఓరగా వేసి వెళ్ళిపోయింది అమీనా. నా గది స్వగతాలతో కృంగిపోతోంది. నా మది అనుభవాలతో మండిపోతోంది. చిన్నగా నిట్టూర్చింది సులోచన.

కాసేపు అలాగే మంచం మీద కూచుని లేచి నిలబడింది. నల్లమాను చెక్కలా బిగింపబడిన పాత కాలపు డ్రెస్సింగ్ టేబుల్ ముందుకెళ్ళి నిలుచుంది సులోచన.

సగం కళాయి పోయిన అద్దంలో కనిపిస్తున్న రూపు రేఖల్ని పరిశీలనగా చూసుకుంది ఆమె.

ఎండలోకి ఎక్కువగా వెళ్ళకపోవడం చేత మరింత తెల్లగా మెరుస్తున్న వంటి ఛాయ. పెద్దవైన కళ్ళు. తాంబూలంతో ఎరుపెక్కిన పెదాలు, పగలంతా ఎక్కువగా నిద్ర పోవడం చేత బుగ్గలు ఉబ్బి కళ్ళ కింద నల్ల గీతలు మరీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉన్నట్టుండి ఏదో తెలీని దిగులు సులోచన నిండా ఆక్రమించుకున్నట్టుగా అనిపించింది. అద్దంలో ఆమెకి బదులుగా ఎవరో యువతి పద్దెనిమిదేళ్ళ నవ యవ్వనవతి రూపం. నల్లనివన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు అని గుడ్డిగా నమ్మి పగటి కలల్లోకి జారిపోయే మధ్య తరగతి ఆడ పిల్ల రూపం... ఆ అద్దంలో ఆమెకి బదులుగా కన్పిస్తూ, కాసేపు నవ్వుతూ, కాసేపు ఏడుస్తూ, కనిపించి మాయమవుతున్నట్టుగాసులోచనకి అనిపించింది.

వికారమైన దాన్ని దేన్నో కడుపులో పెట్టి తిప్పినట్టుగా అనిపించింది.

డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర్నుంచి కదిలి కిటికీ తలుపులు తీసింది ఆమె.

తెరుచుకున్న కిటికీలోంచి వీచిన చలిగాలి కాంతి విహీనమైన ఆమె ముఖాన్ని జాలిగా తాకింది.

రోజులాగే చల్లటి కిటికీ చువ్వల్ని పట్టుకుని బయటికి చూసింది సులోచన. దూరంగా చార్మినార్‌మీద బూడిద రంగు పావురాళ్ళు ఎగురుతున్నాయి. సాయంకాలపు నీరెండ మినార్ల మీద పడి వింతగా మెరుస్తోంది.

హైదరాబాద్ పాత బస్తీ. పావలాకీ, అర్ధకీ వొళ్ళమ్ముకునే ఛౌకబారువేశ్యల్తో కొత్త మెరుగుల్తో అరువు తెచ్చుకున్న యవ్వనంతో ముస్తాబవుతున్నట్టుగా అనిపిస్తోంది.

చార్మినార్‌కి ఎదురుగా ఉన్న సన్నటి గల్లీలోని గాజుల దుకాణాల్లోని రకరకాలైన మట్టి గాజులు లైట్ల కాంతిలో వింతగా మెరుస్తున్నాయి. ఎక్కడ్నించో పకోడీల వాసన ఉండుండి వీస్తున్నగాలిలో కలిసి పరిసరాల్ని అల్లుకుంటోంది.

సులోచన తన చేత్తో ఎడమ రొమ్ముని సుతారంగా తడుముకుంది.

రెండ్రోజుల క్రింద మొగల్‌పురా సారా కాంట్రాక్టర్ తాగిన మత్తులో గట్టిగా కొరికితే పుండు పడిన ఎడమ రొమ్ము, ఇవాళ బాగా నెప్పి తెలుస్తోంది ఆమెకి.

ఎందుకో బాధగా 'అమ్మో' అనుకుంటుంది సులోచన.

చప్పున దాదాపుగా మర్చిపోయిన అమ్మ, నాన్న గుర్తొచ్చారు.

ఎలా వున్నారో? ఏమయ్యారో? అనుకుంది ఆమె గతాన్ని, జీవితాన్ని తల్చుకుంటూ. ఆమె ఆలోచన అంతకన్నా ముందుకి సాగలేదు. ఊహించడానికి కూడా ధైర్యం చాలలేదు.

# తెలుగు వారి దేశము

కృష్ణ పెన్న గౌత మి
తుంగభద్ర మంజిర
నదులు అన్ని నిండుగ
ఉరుకులెత్తి గుండెలో
నాట్యమాడుచుండగ

అలలతోటి పొంగుచు
తూర్పు నున్న సంద్రము
తనను ముద్దు లాడగ

పులకలెత్త దేహము
పొంగిపోవు దేశము
తెలుగు వారి దేశము......

కాళహస్తి తిరుపతి
భద్రగిరియు శ్రీగిరి
ఇంద్రకీల పర్వతం
పెంపుమీరి తామట
శిరములెత్తి నిల్వగ
చెన్ను మీరు దేశము
తెలుగు వారి దేశము.....

పచ్చపచ్చ చేలతో
కంటికింపు జేయుచు
సస్యమెంతొ పండగ
అన్నపూర్ణ తల్లిగ
ఆదరించు దేశము
ఆంధ్రులుండు దేశము...
అందమైన దేశము....

కొండపల్లి బొమ్మలు
ముద్దబంతి గుమ్మలు
నూలు పట్టు చీరలు
మేలు జాతి ఎద్దులు....

కోనసీమ కొబ్బరి
గోగుకూర బచ్చలి
ఆవకాయ పచ్చడి....
ఆంధ్ర భూమి కంతకు
పేరునీయ జగతిని
పేర్మి నొందు దేశము....
తెలుగు వారి దేశము......

కాకతీయ వైభవం
వేంగిరాజ్య ప్రాభవం
గోలకొండ గౌరవం
తెలుగు నాటి తేజమై
వెలిగి పోవు దేశము
తెలుగు వారి దేశము......

బాలచంద్రు పౌరుషం
పాపరాయ సాహసం
రుద్రమాంబ రాజసం
ఝప్తి నుంచి అహరహం
తెలుగు లంత తేజరిల్ల
వెలిగి పోవు దేశము....
తెలుగు వారి దేశము......

అల్లసాని పెద్దన
ముద్దు పలుకు తిమ్మన
పోతరాజు, భీమన
నీతిచెప్పు వేమన....
తెలుగు కవులు యెందరో
తేట తేట మాటల
తీపి కవన మల్లగ...

తిక్కయజ్వ, ఎఱ్ఱన
ఆదికవిగ నన్నయ
ఆంధ్రమందు వ్రాయుగ
భారతమ్ము మేటిగ

మధురమైన భాషతో
మధువు లొలుకు దేశము
ముదము కొలుపు దేశము
తెలుగు వారి దేశము......

శిల్పకళల విభవము
చేతిపనుల నిపుణిమ
కుంచె చూపు ప్రతిభలు
ప్రతిఫలించ యెల్లెడ

అన్నమయ్య కీర్తనం
కూచిపూడి నర్తనం
రామదాసు భావనం
తనను చేయ పావనం.....

వేంకటేశుడావల
శ్రీగిరీశు డివల
దుర్గ తల్లి లోపల
దీవనిచ్చి కాయుగ......
దీప్తినొందు దేశము
తెలుగు వారి దేశము..
తెలుగు వారి దేశము......

--సుప్రభ

## (గోడమీద పేరు.... )

*న్నాయి. కాళ్ళు బావిలో నీళ్ళలాగా ప్రశాంతంగా వున్నాయి. కిటికీ దగ్గర నిలబడి వున్న ఆమె దగ్గరకొచ్చి,*

*"అప్పడే చీర మార్చేశావ్?" అంటూ నవ్వి, పూలదండ చేతిలో పెట్టింది.*

*ఆమె ఏమీ మాట్లాడకపోవడంతో ఆ పిల్ల గోడకి తగిలించిన పాత సీనరీని చూస్తూ తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది.*

*ఆమె కిటికీ దగ్గర్నుంచి గది మధ్యకి వచ్చి నిలబడింది.*

*గోడకి తగిలించిన సీనరీనికాంతిలేని గాజుకాళ్ళతో, నిస్తేజంగా, నిర్లిప్తంగా చేజేతులుమారి కనిపించని తీరంలోకి జారుకున్న జీవితాన్ని వెతుక్కుంటున్నట్టుగా చూసింది ఆమె.*

*ఎత్తుగా ఆకాశంలోకి పెరిగిన టేకుచెట్లు. చెట్ల మధ్య మలుపు తిరిగి మాయమవుతున్న మట్టి తోవ. ఒకరి చేతిలో ఒకరి చేతులుంచుకుని తోవలో నడుస్తున్నట్టుగా ఇద్దరు. ఒకస్త్రీ, ఒక పురుషుడు.*

*ఊహ తెలిసినప్పటి నుంచి చూస్తున్న దృశ్యంలో ఎలాంటి మార్పూ లేదు. కానీ చూసే చూపు మాత్రమే మారిపోతుంది.*

*ఇంతలో కింద హాల్లోంచి ఎవర్నో పెద్దగా అరుస్తున్న హీరాబాయి గొంతు వినిపించింది.*

*చీకటి గర్భంలో కలిసి మాయమైన దౌర్భాగ్యపు జీవితాలకి ప్రతీకల్లా మిగిలి, నిలిచినసాక్ష్యాల్లా కప్పుకి వేలాడుతూ వూగుతున్నాయి సాలెగూళ్ళు.*

*కిటికీలోంచి చలిగాలి కొడుతోంది.*

*ఆమె చుట్టూ చీకటి పొరలు పొరలుగా కుములుతున్న దుఃఖంలాగా పేరుకుంటోంది.*

*కిటికీ పక్కని గోడ మీద పెన్సిల్‌తో రాయబడిన ముగ్గురి స్త్రీల పేర్ల కింద వణికే చేతుల్తో, పెన్సిల్ పట్టుకుని రాసింది ఆమె తన పేరు.*

*ఏదో తెలీని దిగులు చిక్కగా అల్లుకున్న ఆమె కళ్ళలో కన్నీటి తెర మెరుస్తూ కనిపిస్తోంది.*

*ఉన్నట్టుండి ఏడుపొచ్చి చేతుల్లో ముఖం దాచుకుంది ఆమె.. గోడ మీద రాసిన ఆమె పేరులోని "అమీనా" అనే మూడక్షరాలు దూర్త లోకంలో చిక్కుకున్న దగాపడిన జీవితంలా దీనంగా కనిపిస్తున్నాయి.*